క్లుప్తంగా

నేడు అంజిరెడ్డి సంతాప సభ

రామగిరి(నల్లగొండ): సీపీఎం సీనియర్ నాయకుడు నన్నూరి అంజిరెడ్డి సంతాప సభ గురువారం జరగనుంది. తిప్పర్తి మండలం అంతయిగూడెంకు చెందిన సీపీఎం నాయకుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అనిశెట్టి దుప్పలపల్లిలో జరిగే సంతాప సభకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి హాజరుకానున్నారు.

సీఎంను కలిసిన కైలాస్ నేత


సీఎం రేవంత్‌రెడ్డితో కైలాస్ నేత

మునుగోడు: సీఎం రేవంత్ రెడ్డిని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున కైలాస్ నేత బుధవారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా మునుగోడు నియోజకవర్గంలోని సమస్యలను సీఎంకు వివరించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషిచేస్తామని తెలిపారు.

మజ్జిగ పంపిణీ


మజ్జిగ పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

నల్లగొండ టౌన్ : నల్లగొండ మాజీ ఎంపీ, రామన్నపేట మాజీ ఎమ్మెల్యే వడ్డేపల్లి కాశీరాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని నెహ్రూగంజ్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో బుధవారం మజ్జిగ పంపిణీ చేశారు. ఫౌండేషన్ సభ్యులు కాశీరాం, మేడి శ్రావణ కుమారి, ఎడ్ల కాంచనమాల, వడ్డేపల్లి శ్రీ మహాలక్ష్మి, వడ్డేపల్లి ఎల్లోర, శ్రీ శక్తి, శ్రీ పంచమి పాల్గొన్నారు.

పండ్లు, బ్రెడ్ అందజేత


బ్రెడ్ అందజేస్తున్న లక్ష్మి

నల్లగొండ టౌన్ : పట్టణంలోని మదర్‌థెరిస్సా హోమ్‌లో బుధవారం నెస్టిల్ కంపెనీ ఆధ్వర్యంలో వృద్ధులకు, మానసిక దివ్యాంగులకు కంపెనీ ప్రతినిధి లక్ష్మి పండ్లు, బ్రెడ్, పాలు, ఇతర వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాధవి, మల్లిక, రాగినయ్య, రాంబాబు, బాలు, నారాయణస్వామి, అంజయ్య, జంజిరాల గిరి , సింగం ప్రవీణ్ పాల్గొన్నారు.

సీఎం నిర్ణయం హర్షణీయం

రామగిరి (నల్లగొండ): న్యాయవాదుల సంక్షేమానికి రూ.100 కోట్లు కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ నాయకులు మేడ మోహన్‌రెడ్డి, లింగపల్లి శ్రీనివాస్, మల్లేపల్లి ఆదిరెడ్డి, నాంపల్లి నర్సింహ, పాశం నరేష్‌రెడ్డి, ముక్కెర శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిధులు కేటాయిస్తున్నందుకు సీఎంకు ధన్యవాదాలు తెలిపారు.

నర్సయ్య గౌడ్‌దే విజయం

మునుగోడు: పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి స్థానం నుంచి పోటీచేసిన బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ భారీ మెజార్టీతో గెలుస్తాడని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు మాదగోని నరేందర్‌గౌడ్ అన్నారు. బుధవారం ఆయన మునుగోడులో విలేకర్లతో మాట్లాడారు. బీజేపీతోనే దేశాభివృద్ధి చెందుతుందని భావించి యువత, మేధావులు బీజేపీకి ఓటు వేశారన్నారు. ఆయన వెంట కర్నాటి శేఖర్ గౌడ్, దుబ్బ జెల్లయ్య, పందుల యాదయ్య, సోలే వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

సుందరయ్య వర్ధంతి సభను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న డబ్బికార్ మల్లేష్

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడలో ఈ నెల 19వ తేదీన నిర్వహించబోయో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు, మండల కార్యదర్శుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రేపల్లి వెంకటేశ్వర్లు, జగదీష్‌చంద్ర, రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, బాండ్ల పాండు, శశిధర్‌రెడ్డి, వినోద్‌నాయక్, అయూబ్, మంగారెడ్డి, రామ్మూర్తి, అంజాద్, శ్రీనివాస్, పాపిరెడ్డి, రాంరెడ్డి, జగన్‌నాయక్ తదితరులున్నారు.

మూసీ రోడ్డుకు మోక్షం కలిగేనా !


కాసనగోడు వద్ద బురదమయంగా మారిన మూసీ రోడ్డు


కేతేపల్లి శివారులో గుంతలు పడి అధ్వానంగా మారిన మూసీ రోడ్డు

- కాసనగోడు నుంచి ప్రాజెక్టు వరకు అధ్వానంగా రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న రైతులు, విద్యార్థులు
- బీటీగా మార్చాలని వేడుకోలు

కేతేపల్లి: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాత అతి పెద్ద సాగునీటి వనరుగా పేరుగాంచిన మూసీ ప్రాజెక్టు వద్దకు వెళ్లేందుకు కేతేపల్లి నుంచి సరైన రోడ్డుమార్గం లేదు. దీంతో మూసీ పరిసర గ్రామాల ప్రజలు, ప్రాజెక్టును వీక్షించేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేతేపల్లిలోని మూసీ కుడి ప్రధాన కాల్వ వెంట కొత్తపేట, కాసనగోడు, బొప్పారం గ్రామాల మీదుగా ప్రాజెక్టు వరకు 13 కి.మీ దారి గతంలో మట్టి రోడ్డుగా ఉండేది. వర్షాకాలంలో ఈ రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడి కనీసం నడవడానికి కూడా వీలుకాని పరిస్థితి ఉండేది. మండల ప్రజలు పలుమార్లు చేసిన విజ్ఞప్తి మేరకు కేతేపల్లి నుంచి 10 కి.మీ. దూరంలో ఉన్న కాసనగోడు శివారు వరకు మూసీకుడి కాల్వవెంట బీటీ రోడ్డు నిర్మించారు. అక్కడి నుంచి మూసీ ప్రాజెక్టు వరకు మూడు 3కి.మీ మట్టి రోడ్డును అలాగే వదిలేశారు. నాటినుంచి మట్టిరోడ్డు నిర్వహణను పట్టించుకునేవారు లేకపోవడంతో మోకాలి లోతు గుంతలు ఏర్పడి అధ్వానంగా మారింది. కేతేపల్లి నుంచి కాసనగోడు శివారు వరకు పదేళ్ల క్రితం వేసిన బీటీ రోడ్డు సైతం నిర్వహణ లేకపోవడంతో గుంతలు పడి నడవడానికి కూడా వీల్లేకుండా మారింది.

కాల్వ కట్టే రోడ్డు మార్గం..

కాసనగోడు గ్రామం నుంచి మూసీ ప్రాజెక్టు వరకు రోడ్డు సక్రమంగా లేకపోవడంతో మూసీ కుడి కాల్వ కట్టపై నుంచే ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్నారు. కాసనగోడు, బొప్పారం గ్రామాల రైతులు ప్రాజెక్టు సమీపంలో ఉన్న తమ వ్యవసాయ భూముల వద్దకు వెళ్లాలంటే ఈ కట్టపై నుంచే వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతులు తమ ధాన్యాన్ని ట్రాక్టర్లు, ఎడ్లబండ్ల ద్వారా ఇళ్లకు తరలించేందుకు ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక వర్షాకాలంలో వరదలు వచ్చి మూసీగేట్లు ఎత్తిన సమయంలో మండల కేంద్రం నుంచి వెళ్లే సందర్శకులు, ప్రాజెక్టు వద్ద విధులు నిర్వహించే సిబ్బంది, అధికారుల బాధలు అన్నీఇన్నీ కావు. కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో కాసనగోడు నుంచి ప్రాజెక్టు వరకు నడక దారే శరణ్యంగా మారింది.

గురుకుల విద్యార్థులకు ఇబ్బందే..

మూసీ ప్రాజెక్టు వరకు రోడ్డు మార్గం లేకపోవడంతో ప్రాజెకు వద్ద ఉన్న జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. ఈ పాఠశాలలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే పాఠశాల వరకు బీటీ రోడ్డు మార్గం లేకపోవడంతో బస్సు సౌకర్యం లేక ఇక్కడకు వచ్చేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి మూసీ ప్రాజెక్టు వరకు బీటీ రోడ్డు నిర్మించి బస్సు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

బీటీ రోడ్డుగా మార్చాలి



ప్రాజెక్టు వరకు రోడ్డు ఉన్న మట్టిరోడ్డు గుంతలమయంగా మారింది. వర్షాకాలంలో కాలి నడకన వెళ్లేందుకు కూడా వీలు కావడం లేదు. మూసీ సందర్శనకు వెళ్లే వాహనదారులు, వ్యవసాయ బావుల వద్దకు వెళ్లే రైతులు కాల్వ కట్టపై నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. పాలకులు స్పందించి మూసీ ప్రాజెక్టు వరకు ఉన్న మట్టి రోడ్డును బీటీగా మార్చాలి.

–కర్ర ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచి బొప్పారం

ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి



కేతేపల్లి నుంచి మూసీ ప్రాజెక్టు వరకు రోడ్డును అభివృద్ధి చేసినట్లయితే మూసీ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతుంది. గురుకుల పాఠశాల వరకు బస్సు సౌకర్యం కల్పిస్తే విద్యార్థులు ఇబ్బందులు తొలగుతాయి. ఈ ప్రాంత ప్రజాప్రతిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి మూసీ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా కృషిచేయాలి.

–రాచకొండ గోపి, గుడివాడ

అక్రమంగా వేసిన రోడ్డు తొలగింపు

నార్కట్‌పల్లి : మండల పరిధిలో శ్రీ వారిజాల వేణు గోపాలస్వామి ఆలయం ఆర్చీ ఎదురుగా ఇటీవల గోకుల్‌దామన్ పేరుతో దాదాపు 100 ఎకరాల్లో వెంచర్ ఏర్పాటు చేశారు. ఆ వెంచర్‌కు హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి నుంచి చెరువు అసైన్డ్ ల్యాండ్ సర్వే నంబర్ 481, 485, 486 ద్వారా అక్రమంగా రోడ్డు వేయడంతో రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు బుధవారం రోడ్డును తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఐబీ డీఈ విఠలేశ్వర్ మాట్లాడుతూ నార్కట్‌పల్లి చెరువు భూమి, అసైన్డ్ ల్యాండ్ ఆక్రమించి వెంచర్‌కు రోడ్డు వేసిన వారికి గతంలో నోటీసులు జారీ చేశామని పేర్కొన్నారు. చెరువు భూమి బఫర్ జోన్ పరిధిలో వెంచర్‌దారులు అక్రమంగా రోడ్డు వేసినట్లు తెలిపారు. సర్వే నివేదికను జిల్లా అధికారులకు అందజేశామని వివరించారు. వీరి వెంట ఐబీ ఏఈఈ రమ, ఆర్ఐ తరుణ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.


రోడ్డును తొలగిస్తున్న అధికారులు

ఫుట్‌బాల్ క్రీడాకారుడికి చేయూత


చెక్కు అందజేస్తున్న రవిప్రసాద్

నల్లగొండ టూటౌన్ : పట్టణంలోని ఛత్రపతి శివాజీ స్పోర్ట్స్ క్లబ్‌కు చెందిన ఫుట్‌బాల్ క్రీడాకారుడు మద్ది కరుణాకర్‌కు వైఆర్పీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎలిశాల రవిప్రసాద్ ఆర్థికసాయం అందజేశారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని న్యూ డైమెన్షన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ లైసెన్స్ ప్రొఫెషనల్ కోచ్ సర్టిఫికెట్ కోర్సు నిర్వహిస్తోంది. అందులో మద్ది కరుణాకర్ పాల్గొనేందుకు రూ.20వేల ఖర్చు అవుతుందని ఎలిశాల రవిప్రసాద్ దృష్టికి ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మపాల గిరిబాబు తీసుకెళ్లారు. స్పందించిన ఆయన బుధవారం హైదరాబాద్‌లో కరుణాకర్‌కు రూ.20 వేల విలువ గల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో కూన శ్రీశైలంగౌడ్, బొమ్మపాల గిరిబాబు, చకిలం శేషగిరిరావు, మారెపల్లి అర్జున్, మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నకిరేకల్: పట్టణంలో పోలీస్ స్టేషన్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సాయి గణేశ్ తెలిపారు. వీటీ కాలనీ, కాటమయ్య బజార్, రహ్మత్ నగర్, విద్యానగర్, మున్సిపల్ ఆఫీస్, రఘురామ థియేటర్, సూర్యనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ


చందుపట్లలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా అధికారి సక్కుబాయి

నకిరేకల్ : మండలంలోని చందుపట్ల గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి సక్కుబాయి తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం పాలు, గుడ్లను పరిశీలించారు. మెనూ ప్రకారం అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందజేయాలని సూచించారు. ఆమె వెంట సీడీపీఓ అన్‌జూమ్, సూపర్‌వైజర్ సునిత, అంగన్‌వాడీ టీచర్లు నాగమణి, సూర్యకళ ఉన్నారు.

బుచ్చిరెడ్డికి కర్క ముత్తారెడ్డి స్మారక పురస్కారం


బుచ్చిరెడ్డి

చండూరు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కర్క ముత్తారెడ్డి స్మారక పురస్కారానికి ఎంపికైనట్లు విజ్ఞాన వికాస మండలి కన్వీనర్ సుమలత, వ్యవస్థాపక అధ్యక్షుడు మధుకర్ ఓ ప్రకటనలో తెలిపారు. విజ్ఞాన వికాస మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు తెలుగు రాష్ట్రాల కవితల పోటీల్లో బుచ్చిరెడ్డిని ఎంపిక చేసినట్లు బుధవారం తెలిపారు. హైదరాబాద్‌లో త్వరలో జరిగే 31వ వార్షికోత్సవంలో పురస్కారాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. బుచ్చిరెడ్డి పురస్కారానికి ఎంపిక కావడంపై పాఠశాల ఉపాధ్యాయ బృందం, కవులు, రచయితలు అభినందనలు తెలిపారు.

నేడు సన్నాహక సమావేశం

దేవరకొండ: దేవరకొండ పట్టణంలోని పీపీఆర్ ఫంక్షన్‌హాల్‌లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో గురువారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న, సీపీఐ నాయకులు హాజరు కానున్నట్లు తెలిపారు. నాయకులు, గ్యాడ్యుయేట్లు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


మునుగోడు : వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

మునుగోడు: గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని యశోద ఆస్పత్రి వైద్యులు కోరారు. మండలంలోని కొంపల్లి గ్రామంలో హైదరాబాద్ యశోద ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో దాదాపు 500 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ వైద్యశిబిరంలో రోగులకు ఉచితంగా మందులు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జాల వెంకన్నయాదవ్, యశోద ఆస్పత్రి వైద్య సిబ్బంది డాక్టర్ జైశ్రీ, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ రాధిక, డాక్టర్ సంతోషి, కాంగ్రెస్ నాయకులు జాల మక్కెన అప్పారావు, రత్నాచారి తదితరులు పాల్గొన్నారు.

కీర్తి ఆస్పత్రిలో..

నల్లగొండ టౌన్ : పట్టణంలోని డాక్టర్స్ కాలనీలో గల కీర్తి ఆస్పత్రిలో బుధవారం స్త్రీలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 100 మంది స్త్రీలకు థైరాయిడ్, షుగర్, ఒబిసిటీ, కర్వికల్, క్యాన్సర్, పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ వసంతకుమారి, డాక్టర్ ఫాతిమా, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మండలం జంకుతండాలో తాగునీటితో పాటు విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ బుధవారం బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు సత్యప్రసాద్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కనపర్తి సత్యప్రసాద్ మాట్లాడుతూ జంకుతండా గ్రామ పంచాయతీలో ప్రజలు ప్రధానంగా డ్రెయినేజీ, విద్యుత్, తాగునీటి సమస్యను తీవ్రంగా ఎదుర్కొంటున్నారని, పంచాయతీ అధికారులు, స్పెషల్ అధికారులు తక్షణమే పరిష్కరించాలని కోరారు. విజయనాయక్, కిషన్‌నాయక్, కో ఆర్డినేటర్ నరేష్‌నాయక్, సుబ్రమాణ్యం రాజు, అంజి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

ఇటుక బట్టీలను తొలగించాలి


ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస్‌నగర్ కాలనీ ప్రజలు

మిర్యాలగూడ : మిర్యాలగూడ మండలంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామపంచాయతీలో ఉన్న ఇటుక బట్టీలను తొలగించాలని కాలనీ ప్రజలు కోరారు. ఈ మేరకు బుధవారం ఆర్డీఓ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందచేసి మాట్లాడారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు వెళ్లే దారిని సైతం ఇటుక బట్టీల యాజమాన్యం ఆక్రమించడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. ఇటుకబట్టీల వల్ల తినే ఆహారంలో, తాగునీటిపై దుమ్ము, బూడిద పడుతుందని, తమ ఆరోగ్యం దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ఇటుకబట్టీలను తొలగించి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని, లేనట్లయితే శ్రీనివాస్‌నగర్ నుంచి పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం వరకు పాదయాత్ర చేసి నిరసన వ్యక్తం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ముడావత్ జగన్, వీరన్న, నుమాన్, జావిద్, పర్వేస్, బిస్మిల్లా, తరుణ్, మోహన్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

చిట్యాల: వెలిమినేడు గ్రామంలోని తొమ్మిదో వార్డుకు చెందిన దండ నర్సింహ(60) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని బీజేవైఎం జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు అంశల అనిల్‌కుమార్ బుధవారం పరామర్శించి ఐదు వేల రూపాయల ఆర్థికసాయం అందజేశారు.

హామీలు అమలు చేయాలి

చండూరు: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం చండూరులో నిర్వహించిన సీపీఎం ముఖ్యుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకు ఓటు వేసినవారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి మొగుదాల వెంకటేశం, సహాయ కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ గౌడ్, చిట్టిమల్ల లింగయ్య, రవి, గౌసియా బేగం, కొత్తపల్లి నరసింహ, వెంకన్న, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేస్తాం

చౌటుప్పల్ : ధాన్యం కొనుగోళ్లను త్వరితగతిన పూర్తి చేస్తామని సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి అన్నారు. మండలంలోని చౌటుప్పల్, తాళ్లసింగారం, మందోళ్లగూడెం, నేలపట్ల, ఎస్.లింగోటం, అంకిరెడ్డిగూడెం, జైకేసారం, పంతంగి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన సందర్శించారు. రైతులతో మాట్లాడారు. ఆయా కేంద్రాలలో నిల్వ ఉన్న 13800బస్తాలలో 10వేల బస్తాలను మిల్లులకు ఎగుమతి చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు సహకరించాలన్నారు. రైతులు తమ ధాన్యంలో తాలు, మట్టి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయా కేంద్రాల్లో నిర్వాహకులు సీరియల్ నెంబర్ ప్రకారంగానే తూకాలు వేయాలని, ఎక్కడ కూడా సీరియల్ తప్పొద్దన్నారు. ఆయన వెంట పీఏసీఎస్ సెక్రటరీ ఎరుకల రమేష్, డైరెక్టర్ దొడ్డి శ్రీశైలం పాల్గొన్నారు.


ధాన్యం కొనుగోలును పరిశీలిస్తున్న సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి

హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం

- రూ. 3.28 కోట్లతో నిర్మాణం
- ఇప్పటికే అప్రోచ్ రోడ్డు పూర్తి
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

మాడుగులపల్లి : మండలంలోని ఆగామోత్కూర్ శివారులో పాలేరు వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. భారీ వర్షాలు కురిసినప్పుడు వాగుకు వరద వచ్చి లోలెవల్ వంతెన పైనుంచి నీరు ప్రవహించి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఉండేవి. పరిసర గ్రామాలైన చర్లపల్లి, భీమనపల్లి, బొమ్మకల్లు, కల్వెలపాలెం గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయేవి. ఏళ్లుగా ఇదే పరిస్థితి ఉండడంతో వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు గత ప్రభుత్వానికి విన్నవించగా.. మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు చొరవ తీసుకొని పంచాయతీ రాజ్ నిధులు రూ. 3.28 కోట్లు మంజూరు చేయించారు. గతేడాది అక్టోబర్ మొదటి వారంలో బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసి మేఘా కన్‌స్ట్రక్షన్ సంస్థకు పనులు అప్పగించారు. ఆ వెంటనే ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పనులు ప్రారంభం కాలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో పనులు షురూ అయ్యాయి. 2025 ఏప్రిల్ నాటికి నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. వర్షాలు కురిసి వాగుకు వరద వస్తే గడువు కొంత పెరిగే అవకాశం ఉందని పంచాయతీరాజ్ ఏఈ నరేష్ తెలిపారు. వంతెన పనులు ప్రారంభం కావడంతో స్థానికులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


ఆగామోత్కూర్ వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్న ప్రాంతం, పక్కన అప్రోచ్ రోడ్డు

గుర్రపుడెక్క ఇలా.. నీరు ప్రవహించేదెలా !

- శాలిగౌరారం ప్రాజెక్టు హెడ్‌రెగ్యులేటర్‌లో పేరుకుపోయిన గుర్రపుడెక్క
- రాచకాల్వలో తగ్గిన నీటి ప్రవాహం
- ఆందోళనలో అన్నదాతలు


పల్లివాడ వద్ద పేరుకుపోయిన గుర్రపుడెక్క

శాలిగౌరారం: మూసీనది నుంచి శాలిగౌరారం ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరే పల్లివాడ హెడ్‌రెగ్యులేటర్ సమీపంలో గుర్రపుడెక్క పేరుకుపోయింది. దీంతో ప్రాజెక్టులోకి రాచకాల్వ ద్వారా వరదనీరు వచ్చి చేరడం కష్టతరంగా మారింది. నెల రోజులుగా ప్రాజెక్టులోకి మూసీ నీరువచ్చి చేరుతున్నా నేటికి 14 అడుగుల నీటిమట్టానికి చేరుకోలేకపోయింది. గుర్రపుడెక్కతో పాటూ ఆనకట్టకు గండ్లు పడడం, ఎస్కేప్ తూములకు షట్టర్లు లేకపోవడంతో మూసీనది నీరు దిగువకు వృథాగా పోతోంది.

రైతుల శ్రమదానంతో..

ప్రాజెక్టులు, చెరువులతోపాటూ రాచకాల్వలపై నీటి పర్యవేక్షణకు నీటిపారుదలశాఖ పరిధిలో గతంలో గ్యాంగ్‌మెన్‌లు ఉండేవారు. పదవీ విరమణలతో ప్రస్తుతం ఆ పోస్టులు అత్యధికంగా ఖాళీ అయ్యాయి. శాలిగౌరారం ప్రాజెక్టుతోపాటూ రాచకాల్వ, హెడ్‌రెగ్యులేటర్‌లపై పర్యవేక్షణ సిబ్బంది లేకపోవడం, అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ప్రాజెక్టు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దీంతో స్థానిక నేతల సహకారంతో ఆయకట్టు రైతులే శ్రమదానం చేస్తూ రాచకాల్వను శుభ్రపరిచారు. రైతుల శ్రమదానం వల్లనే నేడు ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతోంది.

నీటిని నిలిపివేయడంతో...

మూసీ ప్రాజెక్టుకు ఎగువ భాగంలో నిర్మించిన ఆనకట్టల్లో శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరు వచ్చేందుకు పల్లివాడ వద్ద నిర్మించిన ఆనకట్ట చివరిది. పల్లివాడ ఆనకట్టకు ఎగువభాగంలో అసిఫ్‌నహర్, భీమలింగం, ధర్మారెడ్డి, బునాదిగాని, పిల్లాయిపల్లి, బాచారం ఆనకట్టలు ఉన్నాయి. ఈ ఆనకట్టల వద్ద మూసీ నదికి ఇరువైపులా ఉన్న కాలువల పరిధిలో పంటలకు ప్రస్తుతం నీటిని నిలిపివేయడంతో నేరుగా పల్లివాడ ఆనకట్టమీదుగా మూసీ నదిలోకి ప్రవహిస్తోంది. పల్లివాడ ఆనకట్ట వద్ద ఉన్న హెడ్‌రెగ్యులేటర్ నుంచి శాలిగౌరారం ప్రాజెక్టు రాచకాల్వలోకి నీటిని మళ్లించడంతో మూసీ నది వరదనీరు శాలిగౌరారం ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది. పల్లివాడవద్ద ఉన్న హెడ్‌రెగ్యులేటర్‌ను 1908వ సంవత్సరంలో నాటి నిజాం నవాబులు నిర్మించి అక్కడ నుంచి శాలిగౌరారం ప్రాజెక్టు వరకు సుమారు 35 కిలోమీటర్ల పొడవు రాచకాల్వను తవ్వారు.

21 అడుగుల నీటి సామర్థ్యం..

శాలిగౌరారం ప్రాజెక్టు 1200 ఎకరాల విస్తీర్ణంలో 21 అడుగుల నీటి సామర్థ్యంతో ఐదువేల ఎకరాల ఆయకట్టు కలిగి ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టు నీటి మట్టం 14 అడుగులకు చేరువలో ఉంది. మండలంలోని శాలిగౌరారం, తిరుమలరాయునిగూడెం, శాలిలింగోటం, రామగిరి, గురుజాల, అంబారిపేట, అడ్లూరు, ఊట్కూరు, బండమీదిగూడెం గ్రామాలు శాలిగౌరారం ప్రాజెక్టు ఆయకట్టుగా ఉన్నాయి.


పేరుకుపోయిన గుర్రపు డెక్క

గుర్రపుడెక్కను తొలగించాలి



పల్లివాడ సమీపంలో మూసీనదిపై ఉన్న హెడ్‌రెగ్యులేటర్ వద్ద పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించి శాలిగౌరారం ప్రాజెక్టులోకి సాఫీగా వరదనీరు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. అదేవిధంగా ఆనకట్టకు పడిన గండ్లను పూడ్చి నీటివృథా అరికట్టాలి.

–కట్ట వెంకట్‌రెడ్డి, రైతు, అడ్లూరు.

నివేదిక సిద్ధం చేస్తున్నాం



శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరువచ్చి చేరే పల్లివాడ హెడ్ రెగ్యులేటర్ వద్ద పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించేందుకు అత్యవసర నిధుల మంజూరు కోసం నివేదికలను సిద్ధం చేస్తున్నాం. నిధులు మంజూరు కాగానే గుర్రపు డెక్క తొలగింపు పనులు చేపడతాం.

–రాములు, నీటిపారుదలశాఖ ఏఈ, శాలిగౌరారం ప్రాజెక్టు.